

రంగంలోకి క్యాంపెయినర్లు

- ప్రధాన పార్టీల ముఖ్య నేతలకు కీలక బాధ్యతలు
- రాష్ట్ర, జాతీయ నేతల పర్యటనల కోసం రూట్‌మ్యాప్‌లు
- పల్లెల్లోకి ప్రచార బృందాలు
- ఇకపై హీటెక్కనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచార పర్వం

నిర్మల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు మండుటెండలతో అల్లాడుతున్న జనానికి లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయితే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం తమ స్టార్ క్యాంపెయినర్లను రంగంలోకి దించబోతున్నాయి. దీనికోసం గానూ లోక్‌సభ పరిధిలో ఇప్పటికే మూడు పార్టీలు తమ స్టార్ క్యాంపెయినర్లను ఖరారు చేశాయి. జిల్లాస్థాయి నేతలతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయి నేతలకు ప్రధాన పార్టీలన్నీ తమ క్యాంపెయిన్ బాధ్యతలను అప్పగించాయి. ముఖ్యంగా జిల్లా స్థాయి అగ్రనేతలు లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ముమ్మరంగా ప్రచారం మొదలుపెట్టారు. ఆ తరువాత దశల వారీగా రాష్ట్ర, జాతీయస్థాయి నేతలను రంగంలోకి దిగబోతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల ప్రచారం కోసం ప్రధాన పార్టీలన్నీ ప్రత్యేక రూట్‌మ్యాప్‌ను ఖరారు చేయడంలో నిమగ్నమయ్యాయి. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయిలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌లకు బాధ్యతలు అప్పగించాయి. వీరు తమ తమ నియోజకవర్గాల స్థాయిలో మండలాల వారీగా అభ్యర్థి గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. ఇప్పటికే లోకల్ నేతల ప్రచారపర్వం మొదలైంది. వీరికి తోడుగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క సైతం ప్రచారపర్వానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు. గత మూడు రోజుల నుంచి సీతక్క జిల్లాలోనే మకాం వేసి ముథోల్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనికి తోడు ఇటీవలే పార్టీలో చేరిన నేతలకు సైతం ప్రచార బాధ్యతలను అప్పగించబోతున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సైతం ప్రచారం నిర్వహించనున్నారు. అలాగే బీజేపీ కూడా ఎన్నికల ప్రచారం కోసం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే తమ స్టార్ క్యాంపెయినర్లను సైతం ఆ పార్టీ ఇప్పటికే ఖరారు చేసింది. కాగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల ప్రచార బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకుంటున్నారు. ఆయన జిల్లాతో పాటు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో కూడా ప్రచారం చేపట్టనున్నారు.

ఈయనకు తోడు ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ ఇటీవల పార్టీలో చేరిన సత్యనారాయణగౌడ్ , బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డితో పాటు పెద్దపెల్లి జిల్లా ఇన్‌చార్జీ రావుల రాంనాథ్, లోక్‌సభ ఇన్‌చార్జీ అయ్యన్న గారి భూమయ్యలు విస్తృతప్రచారం చేపట్టే విధంగా షెడ్యూల్ ఖరారు చేశారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ అలాగే బండి సంజయ్, అర్వింద్, రఘునందన్‌రావులు కూడా జిల్లాలో ఆ పార్టీ అభ్యర్థి నగేష్ తరఫున ప్రచారం చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అలాగే జాతీయస్థాయి నాయకులు కూడా తమ పార్టీ అభ్యర్థి తరపున ప్రచారం చేపట్టనున్నారు. కేంద్రమంత్రులు ప్రచారం చేపట్టేందుకు జిల్లాకు రానున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ సైతం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మీ ఆమె భర్త రాంకిషన్‌రెడ్డితో పాటు మరికొంత మంది సీనియర్ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మొదటిదఫా ఎన్నికల ప్రచారాన్ని వీరూ ప్రారంభించారు. కాగా అభ్యర్థి తరపున ఎమ్మెల్యే కేటీఆర్ సైతం రోడ్ షోలు నిర్వహించేందుకు ఆ పార్టీ రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తోంది.

● లోకల్ జిల్లా నేతలే కీలకం

కాగా.. మూడు ప్రధానపార్టీలు ఈ సారి స్థానిక, జిల్లాస్థాయి నేతలకే కీలకప్రచార బాధ్యతలను అప్పగించబోతున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధి విశాలంగా ఉండడంతో ఎక్కడిక్కడే ప్రచారపర్వాన్ని కొనసాగిస్తే సమయం కలిసి వస్తుందని అలాగే ప్రచారం సైతం నిర్దిష్టంగా సాగుతుందంటూ ఈ పార్టీలు భావిస్తున్నాయి. దీనికి అనుగుణంగానే మండలస్థాయి నేతలు, నియోజకవర్గస్థాయి నేతలకు వారి వారి పరిధిలో ప్రచార బాధ్యతలను అప్పజెపుతున్నాయి. అలాగే జిల్లాస్థాయి నేతలకు నియోజకవర్గాల పరిధిలో ప్రచార బాధ్యతలు కట్టబెడుతున్నాయి. ఈ నేతలంతా తమ తమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూనే నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం కుదర్చడం. అలాగే ఎక్కడెక్కడ బలహీనంగా ఉన్నామనే అంశాలనే గుర్తించి అక్కడ బలపడేందుకు అవసరమయ్యే సూచనలు, సలహాలు అందించనున్నారు. వీరూ ఎన్నికల ప్రచార పర్వం ముగిసే వరకు నియోజకవర్గస్థాయిలోని నేతలందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ రూపొందించారు. ప్రతీరోజూ జిల్లాస్థాయిలో ప్రచారంపై సమీక్ష సమావేశాలు నిర్వహించి దానికి అనుగుణంగా మరుసటి రోజూ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించే బాధ్యతలను జిల్లాస్థాయి నేతలకు అప్పగిస్తున్నారు.

● రాష్ట్ర జాతీయస్థాయి నేతలు రంగంలోకి..

కాంగ్రెస్ పార్టీ తరపున సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న నేపథ్యంలోనే జిల్లాలో రెండు చోట్ల జరిగే ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు జాతీయస్థాయి నాయకులైన ప్రియాంక గాంధీ, రాహుల్‌గాంధీలు కూడా జిల్లాలో పర్యటించే అవకాశాలున్నాయని అంటున్నారు. బహుశా వీరిద్దరిలో ఒకరి పర్యటన ముథోల్‌లో జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. బీజేపీ పార్టీ సైతం జాతీయస్థాయి నేతలను రంగంలోకి దింపబోతోంది. కేంద్రమంత్రులతో పాటు మరికొంతమంది ముఖ్యనేతలను ఆ పార్టీ ప్రచార బరిలోకి దింపబోతోందని అంటున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డితో పాటు అగ్రనేతలు లక్ష్మణ్, బండిసంజయ్‌తో పాటు తదితరులు జిల్లాలో రెండు మూడు చోట్లలో జరిగే ప్రచార కార్యక్రమంలో పాల్గొనున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ మాత్రం వరుస వలసలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో తనస్టార్ క్యాంపెయినర్లపైనే ఆశలు పెట్టుకుంటోంది. ముఖ్యంగా మాజీ మంత్రి కేటీఆర్‌పైనే ఆ పార్టీ నమ్మకం ఉంచుతోంది. అవసరమైతే పార్టీ అధినేత కేసీఆర్‌ను సైతం ప్రచారం కోసం జిల్లాకు రప్పించేందుకు ఆ పార్టీ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

అకాల వర్షంతో తడిసి ముద్దయిన భైంసా



గాలివానకు భైంసాలో రోడ్డుపై పడిన చెట్టు

భైంసా, ఏప్రిల్ 22: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో సోమవారం కురిసిన అకాల వర్షంతో తడిసి ముద్దయ్యింది. సాయంత్రం వేళలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాల్లోని చెట్టు విరిగిపోగా.. ఇంకొన్ని ప్రాంతాల్లోని విద్యుత్ తీగలు తెగి సరఫరా నిలిచిపోయింది. ఏకధాటిగా గంట పాటు కురిసిన భారీ వర్షంతో మురికి కాలువలు పొంగి ప్రవహించగా.. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు ఉధృతితో ప్రవహించడం మూలంగా రాకపోకలకు అంతరాయం కలిగింది. వారంతపు భారీ వర్షం కారణంగా వారంతపు సంతలో విక్రయానికి తీసుకోచ్చిన కూరగాయాలు కొట్టుకుపోయాయి. వ్యవసాయ మార్కెట్ కమిటి గ్రేన్ యార్డులో విక్రయానికి తీసుకవచ్చిన పలువురి రైతుల ధాన్యం తడిసిపోయింది.

ముథోల్‌లో వడగళ్ల వర్షం



ముథోల్‌లో వడగళ్ల వర్షం కురుస్తున్న దృశ్యం

ముథోల్, ఏప్రిల్ 22 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని అయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. చేతికి వచ్చిన వరి పంట వడగళ్ల వర్షంతో దెబ్బతింటుందేమోనని రైతులు నిరాశ చెందుతున్నారు. ఏదేమైనా ఈ వడగళ్ల వర్షంతో రైతులు కంగారు పడ్డారు.

బాగులవాడలో బీజేపీ ఎన్నికల ప్రచారం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : జిల్లా కేంద్రంలోని బాగులవాడలో సోమవారం బీజేపీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ నాయకత్వంలో ఎంపీ అభ్యర్థిగా జి. నగేష్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అనేకసార్లు రాజ్యాంగాన్ని మార్చి మోదీపై బురద జల్లే యత్నం చేస్తోందన్నారు. మూడోసారి మోదీ ప్రధానిగా ఎన్నికైతే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, సుభిక్షంగా ఉంటుందన్నారు. అయ్యన్నగారి రాజేందర్, అల్లంభాస్కర్ పాల్గొన్నారు.

దేశాన్ని కొల్లగొట్టి దోస్తులకు దోచిపెడుతుండు

● లక్ష్మణచాందలో రాష్ట్ర మంత్రి సీతక్క

లక్ష్మణచాంద, ఏప్రిల్ 22 : నరేంద్రమోదీ భారతదేశాన్ని కొల్లగట్టి దోస్తులకు దోచిపెడుతున్నాడని రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సోమవారం ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం తేవటంతో పాటు తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా పేదలకు కోట్లాది ఇళ్లను నిర్మించి ఇవ్వటంతో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబంలో అర్హులైన మహిళకు రూ. 1 లక్ష ఇవ్వడంతో పాటు జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేసి తీరుతామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ప్రాజెక్టులు కట్టి, మరెన్నో సంస్కరణలు చేసి దేశాన్ని అభివృద్ధి చేస్తే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అమ్మేసి దోస్తులకు లాభం చేకూరుస్తుందని ఆరోపించారు. రైల్వేలను, ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయటంతో పాటు ఎయిర్‌పోర్టులను, షిప్‌యార్డ్‌లను ప్రైవేట్‌కు అప్పగించి అంబానీ, అదానీలను పెంచిపోషిస్తున్నారని దుయ్యబట్టారు. పేదల కోసం 100 రోజుల ఉపాధి హామీ పథకం తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. బడులను నిర్మించి విద్యావంతులను చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుంటే గుడులను నిర్మించి దేశాన్ని అంధకారంలోకి తీసుకెళ్లే చర్యలకు బీజేపీ పాల్పడుతోందని విమర్శించారు. ఇక బీఆర్ఎస్ పార్టీ పైన లేదు.. కింద లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటేనని వ్యంగంగా చమత్కరించారు. అందువల్ల చేతు గుర్తుకే ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వర్యులు సముద్రాల వేణుగోపాలచారి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు గాజుల రవికుమార్, మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, అబ్బడి ప్రతాప్‌రెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, కోండ్ర నరేష్‌రెడ్డి, బిట్లింగ్ నారాయణ, అట్ల రామ్‌రెడ్డి, రాజేందర్, రాంపెల్లి రమేష్, శేఖర్‌రెడ్డి, అయిట్ల సుదర్శన్, తదితరులు ఉన్నారు.



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సంక్షిప్త సమాచారం

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : నిర్మల్ పట్టణం మహాలక్ష్మి వాడలో నివాసముంటున్న సోనాబాయి అనే మహిళ ఆత్మహత్యకు కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్ సికారి సంతోష్ అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం అదనపు సెషన్స్ జడ్జి కే. అజేష్ కుమార్ తీర్పునిచ్చినట్లు కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతురాలి భర్త వాగ్మారే బాపురావు వృత్తిరీత్యా కూలీలన్నారు. నిందితుడు ఆ మహిళ వద్ద తరచు డబ్బులు తీసుకునే వాడని వాటిని తిరిగి ఇవ్వమని అడగడంతో బూతులు తిడుతూ కర్రతో కొట్టాడని తెలిపారు. మరునాడు ఉదయం లేచి చూసే వరకు ఆ మహిళ ఇంట్లో కనిపించలేదన్నారు. నిందితుడి భార్య ఆ మహిళ ఇంటికి వచ్చి మీ భార్య మా ఇంటి ముందు ఉరేసుకొని చనిపోయిందని తెలిపిందన్నారు. వెంటనే మహిళ భర్త పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై యాసిర్ అరాఫత్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పీపీ వై రమణారావు 16 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైందన్నారు. ఈ మేరకు నేరస్తుడికి శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 22 : మండల కేంద్రంలో పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా భైంసా పట్టణానికి చెందిన మంజూర్ అహ్మద్ టీవీఎస్ మోపెడ్‌పై మహారాష్ట్ర తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. సుమోటో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలల పరిశీలన

కుంటాల, ఏప్రిల్, 22: మండలంలోని లింబా (బీ), ఓలా తదితర ప్రభుత్వ పాఠశాలల భవనాలను సోమవారం పీఆర్‌డీఈ సురేష్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈయన వెంట ఎంపీడీవో రహీం, తదితులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్వచ్ఛందంగా గుంతలను పూడ్చిన యువకులు

● ఏ మాత్రం చలనం లేని అధికారులు



గుంతలను పూడ్చిన దృశ్యం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 22 : 'ప్రమాదాలు జరుగుతున్నా... పట్టించుకోరా' అనే శీర్షికన మండల రహదారిపై గుంతలు పడిన సంఘటనపై గత రెండు నెలల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ సమస్యపై ఇప్పటి వరకు ఏ అధికారి గానీ ప్రజాప్రతినిధి గానీ కనీసం స్పందించకపోగా.. ఎలాంటి చర్య తీసుకోలేదు. ఆర్ అండ్ బి అధికారులైతే ఉలుకూ పలుకూ లేకుండా అదే రోడ్డుపై తిరుగుతున్నారు. కానీ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే రాచాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల మధు, చాకలి రాజు, చిట్యాల అరుణ్, రాంకోల్ల శ్రీకాంత్ అనే నలుగురు యువకులు స్పందించి లక్ష్మణచాంద కస్తూరిబా పాఠశాల నుంచి వడ్యాల్ వరకు రోడ్డుపై గల 11 గుంతలను సిమెంట్ కాంక్రీట్‌తో స్వచ్ఛందంగా పూడ్చివేశారు. ఈ యువకులను గ్రామస్థులతో పాటు మండల వాసులు శభాష్ అని అభినందించారు.

జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

● నర్సాపూర్(జి)లో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత

ఖానాపూర్, ఏప్రిల్ 22 : నిర్మల్ జిల్లాలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఎండ వేడిమికి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నర్సాపూర్(జి) మండలంలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యల్పంగా లోకేశ్వరం మండలంలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 11 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఆ మండలాలను ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. సూర్య తాపానికి ఉదయం 8 గంటలకే ఇంట్లోంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. వీలైనంత వరకు ఎండలోకి రాకుండా ఉండాలని, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : జిల్లాలోని 672 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తాగు నీరు, విద్యుత్, సౌర పలకల ఏర్పాటు, మరుగుదొడ్ల తదితర పనులు మౌలిక సౌకర్యాలు, మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈజీఎస్ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వచ్చే విద్యాసంవత్సరం ఆరంభానికి ముందు పనులు పూర్తి చేయాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఇంజనీరింగ్ అధికారులు అశోక్ కుమార్, శంకరయ్య, మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్‌రావు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ సరఫరా వేగవంతంగా పూర్తి చేయాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... నిరంతరం మిల్లింగ్ ప్రక్రియ కొనసాగాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. రిపోర్టులు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై కఠిన చర్యలుంటాయన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తేమ శాతం 17 లోపు ఉండాలన్నారు. గన్ని బ్యాగులు, వేయింగ్ మిషన్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలపై ఫిర్యాదులు వస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, సివిల్ సప్లైస్, అధికారులు నందిత, శ్రీకళ, వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన జిల్లా కాంగ్రెస్ శ్రేణులు



జిల్లా కేంద్రం నుంచి జన జాతర సభకు తరలిన నాయకులు



ఆదిలాబాద్ తరలివెళ్లిన ఖానాపూర్ కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జన జాతరకు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఈ జన జాతర సభకు హాజరుకాగా నిర్మల్ నుండి వాహనాల్లో నేతలు, శ్రేణులతో కలిసి బయలుదేరి వెళ్లారు. నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి, జడ్పీటీసీ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ్ రాజేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు గంగారెడ్డి, గల్ఫ్ సంఘ నాయకులు వి. స్వదేశ్, సురేందర్, పోతరెడ్డి, భోజన్న, తదితర నాయకులు సభకు వెళ్లిన వారిలో ఉన్నారు.

ఖానాపూర్, ఏప్రిల్ 22 : ఆదిలాబాద్‌లో సోమవారం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభకు ఖానాపూర్ కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం తాము అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఖచ్చితంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొనికేని దయానంద్, మున్సిపల్ ఛైర్మన్ సత్యం, వైస్ ఛైర్మన్ సంతోష్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మైనార్టీ అబ్జర్వర్ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ, నాయకులు అమానుల్లా ఖాన్, మడిగెల గంగాధర్, మీర్జాబేగ్, రాజేశ్వర్, మదిరే సత్యనారాయణ, వెంకటప్పయ్య, అశోక్, శారు, రాజేందర్, తదితరులున్నారు.

బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయాలి

● పీవోడబ్ల్యూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ● ఎక్సైజ్ కార్యాలయంలో వినతి పత్రం అందజేత

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్ట్‌షాపులను మూసి వేయిస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ అన్నారు. రాష్ట్రంలో ఉన్న బెల్ట్ షాపులను మూసి వేయాలని కోరుతూ పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం ఎక్సైజ్ కార్యాల యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ... గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బెల్ట్ షాపులకు పర్మిషన్ ఇస్తే ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులను మూసి వేయిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ తాము ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకొని బెల్ట్ షాపులను మూసి వేయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగామణి, లక్ష్మీ, కవిత, సునీత, మంజుల, రాధ పాల్గొన్నారు.



బెల్ట్ షాపులను మూసి వేయాలని ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రోడ్డు భద్రతపై అవగాహన

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : నిర్మల్ పట్టణం శివాజీచౌక్‌లో సోమవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్, తదితర వాటి ఆవశ్యకతపై వాహనదారులకు వివరించారు. గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పోశెట్టి, నర్సయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

కార్మికవర్గానికి అండగా నిలిచిన వ్యక్తి కామ్రేడ్ లెనిన్

● సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు రాజన్న



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : దోపిడీకి గురవుతున్న పీడితవర్గాలు తమ పోరాటం కొనసాగించాలని కార్మిక వర్గానికి అండగా నిలిచిన వ్యక్తి కామ్రేడ్ లెనిన్ అని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు రాజన్న అన్నారు. సోమవారం నిర్మల్‌లోని భగత్ సింగ్ భవన్ పార్టీ కార్యాలయంలో రష్యా విప్లవ నాయకుడు లెనిన్ 154వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ... కామ్రేడ్ లెనిన్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు లక్ష్మీ, శ్యామ్ రావు, రాజు, లక్ష్మణ్, పుష్పలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

.. సీపీఐ ఘన నివాళులు



లెనిన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రముఖ సోషలిస్టు విప్లవ సాధనకుడు లెనిన్ జయంతి సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఐ ఘనంగా నిర్వహించింది. ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడుతూ... లక్ష్యం కోసం జీవితాలు త్యాగాలు చేసిన మహానుభావులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అందులో లెనిన్ ఒకరని కొనియాడారు. సోషలిస్టు విప్లవం జయప్రదం చేసి రష్యన్ ప్రజల కలలు నిజం చేసిన మహనీయుడన్నారు. లెనిన్ జీవితం యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. నాయకులు పోశెట్టి, రజిత, నర్సయ్య, నవీన్, మజీద్, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఎస్ఎఫ్ఐ నివాళులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 22 : లెనిన్ జయంతి సందర్భంగా సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఘన నివాళులర్పించారు. అధ్యక్షుడు నవీన్, సత్యం, సతీష్, రజిత పాల్గొన్నారు. భారత దేశ విముక్తికై పోరాడాలని లెనిన్ పిలుపునిచ్చారన్నారు.

దేశ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ధనసరి అనసూయ సీతక్క

మామడ, ఏప్రిల్ 22 : దేశం అభివృద్ధి చెందాలంటే అది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం మామడ మండలంలోని అనంతపేట్, నల్దుర్తి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎంపీ అభ్యర్థి ఆత్ర సుగుణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పది సంవత్సరాలలో దేశంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, మతం కాదు అన్ని మతాలను గౌరవించడమే మనిషి బాధ్యతని అన్నారు. మతంతోనే గెలుస్తామని అనుకుంటున్నారే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని, చీకటి ఒప్పందంతో డ్రామాలు తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, రాబోయే రోజుల్లో కూడా మరిన్ని పథకాలు అమలు చేసి దేశంలోనే అగ్రగామిగా నిలుస్తామన్నారు. మేము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. పోడు భూముల సమస్యను ఎంపీ ఎలక్షన్ తర్వాత వెంటనే పరిష్కరిస్తామని మీకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటామన్నారు. ఇకనైనా ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, జడ్పీటీసీ సోనియా సంతోష్, ఎంపీపీ అమృత జైసింగ్, వైస్ ఎంపీపీ లింగారెడ్డి, ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొనికేని దయానంద్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అన్వార్, వకీల్, నిమ్మల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నల్దుర్తిలో మాట్లాడుతున్న సీతక్క, పక్కన ఎంపీ అభ్యర్థి సుగుణక్క, శ్రీహరిరావు

ఎమ్మెల్యే హరీష్‌బాబును విమర్శిస్తే ఊరుకోము

● చింతల మానేపల్లి బీజేపీ మండల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 22: ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శిస్తే ఊర్కునేది లేదు అని మండల బీజేపీ నాయకులు సోమవారం హెచ్చరించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు రావి శ్రీనివాస్‌తోపాటు ఇతర నాయ కులు ఎమ్మెల్యే హరీష్ బాబు, ఆయన కుటుంబసభ్యులను నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. త్వరలోనే వారికి బుద్ధి చెప్తామన్నారు. కొందరు నాయకులు అధికారం కోసం ఓడిపోయిన వెంటనే అధికారపార్టీలోకి వెళ్లి మాట్లాడుతున్నారని అన్నారు. అధికారం లేక కనీసం రెండు, మూడు నెలలు కూడా వారు ఉండలేరన్నారు. గతంలో సిర్పూర్ నియోజకవర్గం అక్రమ దందాలకు అడ్డాగా ఉండేదన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేస్తున్నారని, వందకోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతోనే అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చౌదరి రంగన్న, చందు, చాప్లె సుధాకర్, సత్తయ్య, పవన్ పురోహిత్, నగపురె మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక వాయిదా పడ్డ సర్వసభ్య సమావేశం



ముథోల్, ఏప్రిల్ 22 : మండల కేంద్రమైన ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్ అధ్యక్షతనలో జరగవలసిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాములు తెలిపారు. మరలా నిర్వహించే సర్వసభ్య సమావేశం తేదీని తెలియ జేస్తామన్నారు.

ఉపాధిహామీ వేతనాలు మంజూరు చేయాలి



ఉపాధిహామీ వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్న కూలీలు

జైనూర్, ఏప్రిల్ 22: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్నటికి తమకు కూలి డబ్బు రావడం లేదని, అధికారులకు ఎంత చెప్పిన పట్టించుకోవడం లేదని మండలంలోని భుసిమెట్ట(ముక్కెరగూడ) కూలీలు వాపోయారు. ముక్కెర గూడ గ్రామంకూలీలు సోమవారం విలేకర్లతో మాట్లాడారు. 15రోజుల క్రితం వ్యవసాయ పనులు ముగించుకుని, కుటుంబపోషణ నిమిత్తం ఉపాధి పనులకు వెళ్తే సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కూలి చెల్లించాలని పలుమార్లు అధికారులను వేడుకుంటున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు వెంటనే వేతనాలు మంజూరు చేయాలన్నారు. లేకపోతే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలి



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

తిర్యాణి, ఏప్రిల్ 22: మండలంలోని మొర్రిగూడ గ్రామంలో సోమవారం అటవీ అధికారులు అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, అడవులతో మానవులకు ఉన్న సంబంధం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి మహేందర్ మాట్లాడుతూ గ్రామస్థులు సమీప అటవీలో అటవీ హక్కు పత్రాలతో వ్యవసాయం చేసే వారు హద్దులు చెదరకుండా, నిప్పుపడకుండా చూడాలన్నారు. ఇష్టానుసారంగా చెట్లు కొట్టవద్దని, పశువుల కాపలాదారులు పవువులను తమకు కేటాయించిన స్థలంలోనే మేపాలని సూచించారు. కార్యక్రమంలో అటవీఅధికారులు సువర్ణ, రవీందర్, మాజీ సర్పంచ్ లచ్చు, జంగుపటేల్, భగవంతరావు, గోపాల్, దౌలత్, లఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఆసిఫాబాద్ కలెక్టర్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిని సూపరింటెండెంట్ చెన్న కేశవులుతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్యులు, సిబ్బందితో సేవలు, పలు అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. సమయపాలన పాటిస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేయాలన్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఎండవేడి వల్ల అస్వస్థతకు గురైనప్పుడు ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజే యాలన్నారు. ఉపాధిహామీ కూలీలను నిత్యం అప్రమత్తం చేస్తుండాలని తెలిపారు. బయటకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలన్నారు. ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులతో పాటు కిందిస్థాయి సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని తెలిపారు. రోగులపట్ల మానవ త్వంతో వ్యవహరించాలని అన్నారు. ఆసుపత్రిలోని రికార్డుల్లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలన్నారు. పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఆసుపత్రిలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం భటల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ చెన్న కేశవులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రిని సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

ఆసిఫాబాద్ రూరల్/వాంకిడి: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను మే31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం రాజురా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను, వాంకిడి మండలంలోని బోరా గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలను అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సహాయక ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తయారు చేసిన ప్రతిపాదనలలో పొందుపరిచిన అంశాలను సూక్ష్మంగా పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా విద్యుదీకరణ, తాగునీరు, మరమ్మతుల పనులను చేపడతామన్నారు. ఈ క్రమంలో వేసవి సెలవుల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టాల్సిన అత్యవసర పనులను ప్రాధాన్యతనిచ్చి ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. తాగునీటి కొరకు పాఠశాలలో ఉన్న చేతి పంపులలోనే సబ్మెర్సిబుల్ మోటారును బిగించి బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రూఫ్ లీకేజీని అరికట్టేందుకు కెమికల్ ట్రీట్మెంట్‌ను చేయాలని తెలిపారు. మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, సెక్టోరల్ అధికారి భరత్ కుమార్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రామకృష్ణ, డీఆర్‌ఈఈ శ్రీనివాస్, ఎస్‌ఈ గిరీష్, ఎంపీడీవో, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

అలంకారప్రాయంగా.. క్రీడా మైదానాలు

● నిర్వహణ శూన్యం ● మైదానాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు ● నిరుపయోగంగా క్రీడాకిట్లు



వాంకిడి క్రీడామైదానం బోర్డు

వాంకిడి, ఏప్రిల్ 22: గ్రామీణప్రాంత విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో గత ప్రభు త్వం ఊరూరా తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.లక్షల్లో వ్యయం చేసింది. వాటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి నిర్వ హణ పట్టించుకోకపోవడం, కొన్ని మైదానాలు ఆట లకు అనువుగా లేకపోవడంతో నిర్దేశించిన లక్ష్యం నెరవేరడంలేదు. అనేక పంచాయతీల్లో క్రీడాప్రాంగ ణాల సౌకర్యాల కల్పనలో అధికారులు పట్టించకోక పోవడంతో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15మండలాల్లో 1102క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో 902ప్రాంగణాలకు ప్రభుత్వస్థలం గుర్తించగా మిగి తా 200ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించ లేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 878 క్రీడా ప్రాంగణాలను పూర్తిచేసినట్లు అధికా రుల లెక్కలు తెలుపుతునప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఎక్కడా అన్ని విధాల సౌకర్యాలు కల్పించిన దాఖలాలు లేవు. ఒక్కో ప్రాంగణలో భూమి చదును చేసేందుకు, మొక్క లు నాటేందుకు సౌకర్యాల కల్పనకు రూ.2లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అనేక ప్రాంగణాల్లో నామ్‌కే వాస్తేగా పనులు చేసి అధికారులు చేతులు దులుపినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్రీడాప్రాంగణా లపై అధి కారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తుండడంతో అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి రికార్డుల్లో మాత్రం పనులు పూర్తి అయినట్లు చూపిస్తున్నారు. దీంతో చాలా మైదానా లు చదును చేయక పోగా పిచ్చి మొక్కలతో దర్శన మిస్తున్నాయి. కొన్ని ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా ఉండి కనీసం సరైన రహదారి సైతం లేకుండా ఉన్నాయి.

నిరుప యోగంగా కిట్లు..

క్రీడాప్రాంగణాల కోసం గత ప్రభుత్వం జిల్లాకు 937క్రీడాకిట్లను మంజూరు చేసింది. ఒక్కో కిట్లో క్రికెట్, వాలీబాల్ కిట్, టీషర్టులు, మూడు జతల డంబెల్స్‌తో పాటు మొత్తం 23 రకాల ఆట పరికరాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల వారీగా అధికారులు కిట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం క్రీడా మైదానాలు ఆటలకు అనువుగా లేకపోవడంతో వాటిని వినియో గించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్రీడా కిట్లు పంచాయతీల్లో మూలకు చేరాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ముందురోజు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారి ఆలయం ఎదుట జెండా ఎగురవేసి నవగ్రహ స్థాపనపూజ, సహస్ర తమలాపత్ర, ఫలపుష్పార్చన, మంగళహారతి, మహామంత్రం, తీర్థప్రసాద వితరణ, మహాప్రసాదం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాంచందర్, గురుస్వామి రవి, నరేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



ఆర్‌వోబీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), ఏప్రిల్ 22: కాగజ్‌నగర్-సిర్పూర్(టి) మధ్య వేంపల్లి సమీపంలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి, రోడ్డు బీటీ రెన్యూవల్ పనులను సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌వోబీ, రోడ్డు పనులు పూర్తైతే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుంద న్నారు. అలాగే వేంపల్లి గ్రామం వద్ద గ్రామస్తుల కోరిక మేరకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.


సభలో డోలు వాయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



- జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు
- బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరైన జనం
- 25 నిమిషాల్లోనే ముగిసిన సీఎం ప్రసంగం
- గట్టి బందోబస్తును ఏర్పాటు చేసిన పోలీసులు
- ముఖ్యమంత్రి పర్యటనతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్
- పార్టీ అభ్యర్థి నామినేషన్‌కు హాజరుకాని రేవంత్‌రెడ్డి


జనజాతర సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


సభలో తరలివస్తున్న జనం

జనజాతరకు జేజేలు


సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఆదిలాబాద్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని డైట్‌మైదానంలో నిర్వహించిన జనజాతర బహిరంగ సభకు జనం జేజేలు కొట్టారు. సభావేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డోలు వాయించి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎండ తీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరివుతూనే పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి జనం తరలివచ్చారు. సుమారుగా 30వేలమంది సీఎంసభకు హాజరైనట్లు కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో జిల్లాకు చేరుకున్నారు. సీఎంకు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతోపాటు కాంగ్రెస్‌పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. డైట్ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు సీఎం హాజరయ్యారు. మొదట మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగించిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించి 25 నిమిషాల్లో ముగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాపై వరలా జల్లును కురిపించారు. ప్రధానంగా దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణని గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సీఎం పర్యటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్‌నింపింది. ఇందులో మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, వేణుగోపాలచారి, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, గడ్డంవినోద్, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్‌బాపురావు, కోనేరు కోనప్ప, నియోజక వర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, శ్యాంనాయక్, నారాయణరావుపటేల్, శ్రీహరిరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, తదితరులున్నారు.

• సీతక్కతో కలిసి నామినేషన్ దాఖలు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ నామినేషన్‌కు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని అంతా అనుకున్నా సీఎం షెడ్యూల్ 2గంటలు ఆలస్యంకావడంతో బహిరంగ సభను ముగించుకుని తిరిగి వెళ్లిపోయారు. దీంతో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీహరిరావు, సిర్పూర్ కాగజ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలతో కలిసి ఆత్రంసుగుణ తన నామినేషన్‌ను దాఖలు చేసింది.

• జిల్లా సమస్యలపై ఫోకస్

సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర బహిరంగ సభలో ఉమ్మడి జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పై తీవ్రవిమర్శలు చేస్తూఏ ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సమస్యలపై ప్రసంగించడం కన్పించింది. ముఖ్యంగా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, యూనివర్సిటీ ఏర్పాటు, కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, కడెం ప్రాజెక్టు మరమ్మత్తులు, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం ప్రసంగం కొనసాగింది. ప్రైవేట్ కంపెనీలతో మాట్లాడి సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తామంటూ పేర్కొంటూనే వచ్చే ఐదేళ్లలో కడెం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఆదివాసీ గిరిజనులకు ఉన్నత విద్య అవకాశాలను అందుబాటులోకి తెచ్చేలా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తానికి 25 నిమిషాల పాటు సీఎం ప్రసంగం కొనసాగింది.

• గట్టి బందోబస్తును ఏర్పాటు చేసిన పోలీసులు

సీఎం జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ బహిరంగ సభ వద్ద పోలీసు బలగాలను మోహరించారు. నిర్మల్ వైపు నుంచి వచ్చే వాహనాలకు టీటీడీసీకి ఎదురుగా మైదాన ప్రాంతంలో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు. అలాగే రాంలీలా మైదానంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు వీఐపీల వాహనాలకు పార్కింగ్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కలెక్టర్ చౌక్ నుంచి ఎన్టీఆర్‌చౌక్ మీదుగా డైట్ మైదానం వరకు వన్‌వే ద్వారా వాహనాలను తరలించారు. బహిరంగసభ తర్వాత కూడా వన్‌వేలోనే జనం బయటకు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పర్యవేక్షణలో పోలీసులు ముఖ్యమంత్రి పర్యటనకు గట్టి బందోబస్తును కల్పించారు.

కుప్టి ప్రాజెక్టును నిర్మిస్తాం.. సీసీఐని పునరుద్ధరిస్తాం

• మహారాష్ట్రను ఒప్పించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మిస్తాం

• ఆదిలాబాద్‌కు యూనివర్సిటీని మంజూరు చేస్తాం: జనజాతర సభలో సీఎం

"జిల్లా ప్రజలకు మాట ఇస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వహయాంలోనే కుప్టి ప్రాజెక్టును నిర్మించి మూతబడిన సీసీఐ పరిశ్రమను తెరిపిస్తాం. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనజాతర బహిరంగసభకు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందని, ఆరుగ్యారంటీల విషయంలో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. త్వరలో రైతుల రూ.2లక్షల రుణమాఫీని చేస్తామన్నారు. ఆనాడు రైతులు పండించిన వరి పంటను కొనే దిక్కులేక కళ్లాల్లోనే వడ్ల కుప్పల మీద రైతులు గుండె ఆగిచనిపోయిన పరిస్థితి ఉండేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తూ బోనస్‌గా రూ.500ను అందించి ఆదుకుంటామన్నారు. ఆదిలాబాద్ అడవి బిడ్డలు తెల్లవారిపై వీరోచితంగా పోరాటం చేశారన్నారు. ఆదివాసీలు పండించిన పంటలను దళారులు దోపిడీ చేస్తుంటే 1980లో ఆదివాసీ బిడ్డలు తిరుగుబావుట ఎగురవేశారన్నారు. ఆనాటి ప్రభుత్వంపై దోపిడీదారులు, దళారుల మీద తిరుగబడితే కాల్పుల్లో ఆదివాసీ బిడ్డలు చనిపోయారని, ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం సాక్షిగా ఆ అమరవీరుల కుటుంబాలను ఆదుకున్నామని పేర్కొన్నారు. ఆదివాసీల ఇష్ట దైవమైన నాగోబా ఆలయానికి కోట్లు కేటాయించి ఆదివాసీల జాతర, సాంస్కృతి సాంప్రదాయాలను గౌరవించడం జరిగిందన్నారు.

• మహారాష్ట్రను ఒప్పించి ప్రాజెక్టును కడుతాం..

కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన కడెం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో కూలిపోయే ప్రమాదం వచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే కడెం ప్రాజెక్టు మరమ్మత్తులకు నిధులు కేటాయించామన్నారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మిస్తామన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని లక్షన్నర ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. మహారాష్ట్రతో చర్చలు జరుపుతున్నామని, 1800 ఎకరాల ముంపు భూములకు పరిష్కారాన్ని చూపుతామన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును నిర్మించి దానికి మళ్లీ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెడతామన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీని మంజూరు చేసి ప్రారంభిస్తామన్నారు. తొందరలోనే ప్రైవేట్ వ్యక్తులతోనైనా మాట్లాడి సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తామన్నారు. ఆదిలాబాద్‌లో ఆత్రంసుగుణ గెలువక పోతే ఈ పథకాలన్నీ ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. వైఎస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లపై పేరుమీద తండాలు, గూడాలు, బీసీ కాలనీల్లో అడిగిన వారందరికీ ఇళ్లు ఇచ్చామన్నారు. దానికి ప్రత్యక్ష సాక్షే ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అని తెలిపారు. డబ్బా ఇళ్లు అంటూ ఎద్దేవా చేసిన కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేశాడన్నారు.

• కాంగ్రెస్‌ను ఓడగొడితే పేదలకే నష్టం

కాంగ్రెస్‌ను పడగొట్టిన.. ఓడగొట్టిన.. ఆత్రంసుగుణ గెలువకపోయినా మీ ఇందిర్మ ఇళ్లు, ఉచితంగా వచ్చే రూ.5లక్షల నిధులు ఆగిపోతేనష్టం పేదలకేనని మోదీకి, కేసీఆర్‌కు కాదన్నారు. మోదీకి ఓటేసిన, కేసీఆర్‌కు ఓటేసిన ఒక్కటేనని వీరిద్దిరూ తోడుదొంగలు అంటూ తీవ్ర విమర్శలుచేశారు. ఆత్రం సక్కు, గోడంనగేష్‌ను చూశారు వాళ్లిద్దరూ కొత్తవాళ్లు కాదు. వారి పనితనం మీ అందరికీ తెలుసు. మంచోడు మంచోడు అని మంచం ఎక్కిస్తే మంచమంతా పాడు చేసిండటా యెనకట ఒకడు ఆత్రంసక్కు లాంటివాడు. నగేష్ గురించి ఏం చెప్పాల్సిన అవసరం లేదు. బుద్ధి మంతుడని సద్దికడితే బొడ్డురాయికాడ బొర్ల పండుకున్నాడటా నగేష్ లాంటోడు అని విమర్శించారు.


జనజాతర సభకు హాజరైన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు

బీజేపీది అడ్డగోలు పాలన



• శ్రీధర్‌బాబు, రాష్ట్ర మంత్రి

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని అడ్డగోలుగా పాలిస్తోంది. మతతత్వ పార్టీగా చెప్పుకునే బీజేపీకి బుద్ధిచెప్పాలి. కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారు. ప్రధానిగా ఉన్న మోదీ పదేళ్లలో చేసిందేమీ లేదు. ఇచ్చిన ఎన్నికల మెనిఫెస్టోలో హామీలను అమలు చేయలేదు. ఆదివాసీలు బడుగుబలహీనవర్గాల సంక్షేమం కోసం ఏ ఒక్క కార్యక్రమాన్ని చేపట్టలేదు. మోదీ ప్రభుత్వ హయాంలో ఏదైనా జరిగిందో లేదో ప్రజలే ఆలోచించాలి. దేవున్ని అందరూ కొలుస్తారు. బీజేపీ మాత్రమే దేవుడుపేరు చెప్పుకుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక దేవాలయాలను నిర్మించాం. దేవుడు మావైపే ఉన్నాడు. ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తాం.

చెప్పుకోవడానికి ఏమీలేకనే కాంగ్రెస్‌పై ఆరోపణలు



• సీతక్క, రాష్ట్ర మంత్రి

చెప్పుకోవడానికి అభివృద్ధి ఏమి లేకనే బీజేపీ కాంగ్రెస్ పై విమర్శలు చేస్తుంది. పదేళ్ల ప్రధానిగా ఉండి మోదీ ఏం చేశారో చెప్పాలి. హిందువులు కూడా దేవుళ్లను మొక్కుతాం దానిపై కూడా జీఎస్టీ వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అందరిది. అభివృద్ధి కోసం పాటు పడుతుంది. ఆహార భద్రత కింద 81కోట్ల మందికి రేషన్‌కార్డులు, ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టే. మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలీండర్ ఇస్తున్నాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ పార్టే. యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి బీజేపీ మోసం చేసింది. జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ మోసం చేశారు. మోదీ మరోసారి గెలిస్తే రాజ్యాంగం ప్రమాదంలో పడుతుంది. ఆరు గ్యారంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేసి తీరుతాం.

ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపండి



• కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపించాలని, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. మొదటి సారిగా కాంగ్రెస్ పార్టీ మహిళ అభ్యర్థికి అవకాశం ఇచ్చింది ఆదరించండి. పేద ఆదివాసీ బిడ్డను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలని, నేను సచ్చే వరకు కాంగ్రెస్ వెంటే ఉంటా ను. బడుగు బ లహీనవర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం. కొంగుచాచి అడుగుతున్నా ఒక్కఅవకాశం ఇవ్వండి. రాహుల్ ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ గెల వాలి. వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధిచేసేందుకు అవకాశం కల్పించండి.

బీజేపీ ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలి



• వెడ్మబొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

గడిచిన పదేళ్లలో బీజేపీ పార్టీ ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలి. ముఖ్యంగా బీజేపీ పార్టీ అభ్యర్థి గోడంనగేష్ ఆదివాసీలకు చేసింది ఏమీ లేదు. ఆయన కు ఆదివాసీల పై ప్రేమ ఉంటే దోతి కట్టుకుని ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలి. ఏనాడు ఆదివాసీల గురించి ఆలోచించని గోడంనగేష్ ఇప్పుడు ఆదివాసీలపై కపట ప్రేమను చూపుతున్నారు. జిల్లాలో బీఆర్ఎస్ ఉనికే లేకుండాపోయింది. జిల్లాకు బీజేపీ చేసింది ఏమీ లేదు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతాం.

ఐదోరోజు మూడు నామినేషన్ల దాఖలు



మంత్రి సీతక్కతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న ఆత్రంసుగుణ

ఆదిలాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఐదోరోజైన సోమవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థిగా మేస్రంగంగాదేవి నామినేషన్ దాఖలు చేయగా రాథోడ్ సుభాష్ స్వతంత్ర అభ్యర్థిగా రెండో నామినేషన్‌ను దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ మంత్రి సీతక్కతో కలిసి తన నామినేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషాకు అందజేశారు. అయితే రెండు రోజుల క్రితమే ఆత్రం సుగుణ తరఫున కాంగ్రెస్ పార్టీ నేతలు తొలి నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. మొత్తం మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. మిగిలిన మూడురోజుల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులతో పాటు మరికొంత మంది అభ్యర్థులు నామినేషన్‌ను దాఖలు చేసే అవకాశం కనిపిస్తుంది.


కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన ఏఎంసీ మాజీ చైర్మన్

గుడిహత్నూర్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్‌కు చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ ఆడే శీల సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన జన జాతరలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆడే శీలతో పాటు గుడిహత్నూర్ మాజీ జడ్పీటీసీ మస్కే మాధవ్, డాక్టర్ కైలాస్, మరికొంత మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు ఆడే శీల తెలిపారు.


ముత్నూర్‌లో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముత్నూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

గుడిహత్నూర్, ఏప్రిల్22: మండలంలోని ముత్నూర్‌లో భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంతేజి సరిపుత్ర చేతుల మీదుగా ఆవిష్కరణ చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సభ్యులు సత్యవాన్, చిక్టే, రవి, జాబాడే, వాగ్మరే శైలేందర్, లహూదాస్ సనానే, మాజీ సర్పంచ్ విజయ్, గ్రామస్థులు ముఖం విశ్వంబర్, సిద్దార్థ, రఘునాథ్, విఠల్ వాగ్మారే విఠల్, సచిన్, జోంధ్లే పాల్గొన్నారు.

బిర్యానీలో బొద్దింకలు!

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 22: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో తయారు చేసిన వెజ్ బిర్యానిలో బొద్దింకలు రావడంతో కస్టమర్లు ఆందోళనకు దిగారు. సదరు హోటల్ నిర్వాహకులను ప్రశ్నించగా బిర్యానీని మార్చి ఇస్తామంటూ సమాధానం ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. హోటల్ వంటగదిలో దుర్గంధపు వాసన ఉండడంతో ముక్కు మూసుకునే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ తనిఖీలు లేకపోవడంతో హోటల్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. హోటళ్లలో నాసిరకమైన భోజనం అందించడంపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు పర్యవేక్షణ చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించిన హోటల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు.


బిర్యానీలో కనిపిస్తున్న బొద్దింక

లైసెన్సు లేని చిట్టీ వ్యాపారులపై పోలీసుల నిఘా

కాగజ్‌నగర్, ఏప్రిల్22: లైసెన్సు లేని చిట్టీ వ్యాపారులపై పోలీసులు నిఘాపెట్టారు. వారంరోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి రూ.24లక్షలు నగదును స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల తర్వాత పోలీసులు ఇంకా ఎంతమంది చిట్టీలు నడుపుతున్నారు? ఎంతమంది వడ్డీ వ్యాపారులున్నారు..? ఎంతెంత వడ్డీకి డబ్బులు ఇస్తున్నారనే కోణంలో విచారణ చేస్తున్నారు. పట్టణంలో బడా వ్యాపారులు మూడు నుంచి పదిశాతం మేర వడ్డీ వసూలు చేస్తున్నట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వడ్డీ డబ్బులు కట్టలేని వారిని కొంతమంది వ్యాపారులు మానసిక వేధింపులకు గురి చేస్తున్నారు. మరికొంతమంది కేసులు పెడుతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు సమాచారం. వాస్తవంగా ఫైనాన్స్ నిర్వహించాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టరైన వ్యాపారితాను నిర్వహిస్తున్న చిట్టీలో సభ్యులు ఎంతమంది ఉన్నారు. చిట్టీల డబ్బులు ఎంత? జీఎస్టీ ఎంత కట్ అవుతుందన్న అంశాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అలాగే ప్రతి ఆర్థిక సంవత్సరం ఇన్‌కం ట్యాక్స్ కట్టాల్సి ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఇవేవి చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం చేకూరుతోంది. ఇదే విషయమై పట్టణ సీఐ శంకరయ్య మాట్లాడుతూ లైసెన్సు లేకుండా చిట్టీదందాను చేయరాదన్నారు. ఎవరైనా చిట్టీ నిర్వాహకులు, వడ్డీ వ్యాపారులు బెదిరిస్తే తమ దృష్టికి తేవాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలోలో పలువురు నేతల చేరికలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్‌తో పాటు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోకప్రవీణ్‌రెడ్డి, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీచైర్‌పర్సన్ ఆడేశీలతో పాటు పలువురు నేతలు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. త్వరలోనే మరికొంత మంది కౌన్సిలర్లు, ఇతర ముఖ్యనేతలు పార్టీలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

గంజాయి పట్టివేత

సిర్పూర్(యు), ఏప్రిల్ 22: మండలకేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తుల వద్ద 700 గ్రాములు గంజాయిని లభించినట్లు జైనూర్ సీఐ అంజయ్య సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ముగ్గురు వ్యక్తులు బైక్‌పై గంజాయిని తీసుకెళ్తున్నట్లు సమాచారం అందగా పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాం డ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.